లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం

నూజివీడు రూరల్ :రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చెందిన వెలగా ప్రభాకర్‌రావు(65), కాకుమాను రామ్‌ప్రసాద్(41) టిఫిన్ చేసేందుకు సమీపంలోని మీర్జాపురంలోని హోటల్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. బిళ్లనపల్లి అడ్డరోడ్డు వద్ద మెయిన్ రోడ్డు ఎక్కుతుండగా నూజివీడు నుండి హనుమాన్‌జంక్షన్ వైపు వెళ్తున్న గుజరాత్‌కు చెందిన లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రభాకర్‌కు భార్య, ముగ్గురు కుమారులున్నారు. రామ్‌ప్రసాద్‌కు కుమారుడు, భార్య ఉన్నారు. వీరి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రెవెన్యూ అధికారులు మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి శుద్ధత ఎక్కడ..!

యథేచ్ఛగా వాటర్‌ప్లాంట్ల దోపిడీ
నిబంధనలు పూర్తిగా గాలికి
కలుషిత నీరే దర్జాగా విక్రయాలు
పట్టించుకోని అధికార యంత్రాంగం
రెండు జిల్లాల్లోనూ నెలకు రూ.30 కోట్లకుపైనే వ్యాపారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో తాగునీటి వ్యాపారం రోజురోజుకీ పెరిగిపోతోంది. వేసవి ప్రారంభం కానుండటంతో తాగునీటి పేరిట అడ్డూఅదుపు లేకుండా దోపిడీకి తెరలేచింది. వాటర్‌ప్లాంట్లలో నిబంధనల అమలులో అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవ్వడంతో ప్రజలు తమ ఆరోగ్యం ఫణంగా పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తక్కువగా లెక్కించినా దాదాపు 500కుపైగా తాగునీటి ప్లాంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 39 లక్షలు జనాభా ఉండగా పది లక్షల వరకూ కుటుంబాలు ఉన్నాయి. ఆక్వా చెరువుల కారణంగా తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. ముఖ్యంగా డెల్టాలో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. జనం పూర్తిగా వాటర్‌ప్లాంట్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. దీంతో వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. వాటర్‌ప్లాంట్లలో 20 లీటర్ల తాగునీటిని కొన్నిచోట్ల రూ.పదికి, మరికొన్నిచోట్ల రూ.20, ఇంకొన్ని ప్లాంట్లలో రూ.30కూ విక్రయిస్తున్నారు. జిల్లాలో ఆరు లక్షల కుటుంబాలుకుపైగా జనాభా వాటర్‌ప్లాంట్లలో నీటినే వినియోగిస్తున్నట్లు అంచనా. ఆ ప్రకారం లెక్కిస్తే సరాసరిన ఒక్కో కుటుంబం రోజుకు రూ.20 చొప్పున తాగునీటికి కేటాయించినా నెలకు రూ.36 కోట్ల వరకూ జనం తాగునీటి కోసం ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్దమొత్తంలో జనం వాటర్‌ప్లాంట్లలో నీటిని వినియోగిస్తున్నప్పటికీ వాటిపై అధికారుల పర్యవేక్షణ అనేది తూతూమంత్రంగా నెలకొంది. నిబంధనల ప్రకారం వాటర్‌ప్లాంట్లలో ఐఎస్ఐ నిబంధనలు పాటించాల్సి ఉంది. అయితే ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు. ఐఎస్ఐ నిబంధనల ప్రకారం వాటర్‌ప్లాంట్ నిర్మించాలంటే రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఖర్చవుతుందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం నడుస్తున్న వాటర్‌ప్లాంట్లలో అత్యధికం రూ.మూడు లక్షలు పైబడి పెట్టుబడితో ఏర్పాటు చేసి నడిపించేస్తున్నారు. ఐఎస్ఐ నిబంధనలు పాటిస్తూ నడుస్తున్న వాటర్‌ప్లాంట్లు జిల్లాలో వేళ్లపైనా లెక్కించొచ్చు. వాటర్‌ప్లాంట్లలో నీరు తాగితే కాళ్ల నొప్పులు వంటివి పెరిగిపోతున్నాయంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచిగాని, అధికారుల నుంచి సరైన స్పందన లేకుండాపోయింది. ఏదైనా ఫిర్యాదు అందితే తప్ప కనీసం వాటర్‌ప్లాంట్లలో తనిఖీలు అనేవి సైతం ఎక్కడా కానరావడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా రాజకీయ నాయకులు రంగంలోకి దిగి సమస్య బయటికి రాకుండా నొక్కేస్తున్న పరిస్థితి గ్రామాల్లో కొనసాగుతోంది.

నాణ్యతా ప్రమాణాలేవీ..!

వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు చేయాలంటే పరిశ్రమల శాఖతోపాటు పలు శాఖల అనుమతులు తీసుకోవాలి. నీటిని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పరీక్షలు చేసి అనుమతి ఇవ్వాలి. వాటర్‌ప్లాంట్ల ఏర్పాటులో నిబంధనలు పెద్దగా అమలు కావడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. ఆర్వో ప్లాంట్లలో తాగునీటి నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. తాగునీటి ప్లాంట్లలో ముందుగా నీటిని క్లోరినేషన్ చేయాలి. తర్వాత ప్రత్యేకమైన శాండ్‌ఫిల్టర్ ద్వారా వడపోయాలి. ఆపై కార్బన్ ఫిల్టర్స్, మైక్రాన్ ఫిల్టర్స్ శుభ్రం చేసి కంపార్టుమెంట్‌లోకి పంపాలి. ఆఖరి దశలో ఆక్సిజన్‌ను పంపి ఆక్సీకరణ చేయాలి. ఈ దశలో మినరల్స్‌ను జత చేయాలి. ఎక్కడా ఈ విధమైన నీటి శుద్ధత జరగడం లేదు. వాటర్‌ప్లాంట్‌లో నీరు సురక్షితం కాదని వైద్యులు సైతం సూచిస్తున్నారు. నిబంధనల ప్రకారం లీటర్ తాగునీటిలో 150 నుంచి ఉంచి 600 వరకూ మినరల్స్ ఉండాలి. వాటర్‌ప్లాంట్లలో నీటిలో 30 నుంచి 40 వరకూ మాత్రమే మినరల్స్ ఉంటాయని తెలుస్తోంది. వాటర్‌ప్లాంట్లలో నీరు తాగితే దీర్ఘకాలంలో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు జనం వాపోతున్నారు. పంట కాలువల్లో నీరు ఆక్వా సాగుతో కలుషితం కావడంతో జనాలకు వాటర్‌ప్లాంట్లలో నీరే దిక్కుగా మారింది. ఇంతపెద్దమొత్తంలో నీటి విక్రయాలు సాగిస్తున్న వాటర్‌ప్లాంట్లపై నిరంతరం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తాగునీటి వాటర్‌ప్లాంట్లపై దృష్టి సారిస్తే జనాలకు మేలు జరిగే అవకాశం ఉంది.

మోడీ, అదానీల అవినీతిపై ప్రచురించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

అదానీ కుంభకోణంపై
సమగ్ర విచారణ జరిపించాలి

వామపక్షాల సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

పెట్టుబడిదారీ విధానాన్ని పెంచి పోషిస్తున్న అదానీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. అదానీ కుంభకోణం దేశ ప్రజల సంపదకు పెనుముప్పు అని వామపక్షాలు విమర్శించాయి. గురువారం పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో అదానీ కుంభకోణం, బిజెపి అవినీతిపై జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా అదానీ కంపెనీల బాగోతం ఉందన్నారు. అదానీ కుంభకోణాన్ని హిండెన్ బర్గ్ నివేదిక బయటపెట్టిందని తెలిపారు. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యంలో భాగంగా ఇలాంటివి వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఇటీవల మోడీ మతోన్మాద విధానాల బండారాన్ని బిబిసి డాక్యుమెంటరీ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఇది ప్రజలకు తెలియనీయకుండా బిజెపి ప్రభుత్వం భయపడి నిషేధం విధించడం సిగ్గుచేటని విమర్శించారు. బిజెపి అనుసరించే విధానాలన్నీ ఆధాని వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రజల సంపదను దోచిపెట్టడమే అవుతుందన్నారు. దేశంలో కరోనా సమయంలో ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారితే ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థల ఆస్తులు, ఆదాయాలు పెరిగాయన్నారు. అదానీ బాగోతం బయటపడ్డాక కూడా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అదాని గ్రూపులకు గ్రీన్ ఎనర్జీ పేరుతో 12 వేల ఎకరాలను కేటాయించడం సిగ్గుచేటని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు తలుపులు బార్లా తెరవడమే కాకుండా భూములు, నీరు, విద్యుత్ అన్ని వసతులు కల్పిస్తామని, బ్యాంకు రుణాలను సైతం మంజూరు చేస్తామని ప్రభుత్వాలు రెడ్ కార్పెట్లు పరుస్తున్నాయని ఎద్దేవా చేశారు. అంతేకాక ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయనక్కర్లేదని ఈ ప్రభుత్వాలు హామీ ఇస్తున్నాయన్నారు. దానికి అనుగుణంగానే కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చాయన్నారు. ఆదానీకి విద్యుత్, పోర్టులు, విమాయాన, బీమా ఇలా అనేక ప్రభుత్వ సంస్థలను కట్టబెట్టారని విమర్శించారు. అదానీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తును జరిపించాలని, అదాని గ్రూపులకు కేటాయించిన ప్రభుత్వరంగ సంస్థలను వెనక్కి తీసుకోవాలనీ, బ్యాంకులకు ఎగ్గొట్టిన రుణాలు తిరిగి కట్టించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు అధ్యక్షత వహించారు. అనంతరం మోడీ, అదానీ అవినీతిపై ప్రచురించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగ ప్రభాకర్, సిపిఎం నాయకులు పి.కిషోర్, సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వర్రావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, నాయకులు

మహిళా హక్కులను కాపాడుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, చట్టాలను కాపాడుకోవాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి పిలుపు నిచ్చారు. గురువారం ఐద్వా, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మహిళా హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం నుండి సభా ప్రాంగణం వరకూ మహిళలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిని అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యఅతిథులుగా రమణి మాట్లడుతూ ప్రధానంగా మహిళలు వివక్షతతో సమానత్వం లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం లేకుండా దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం ఉపాధి హామీ ఎపిఒ శ్రీదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు తామ ముత్యాలమ్మ, ఐసిడిఎస్ పిఒ ఎన్.స్వర్ణకుమారి, జంగారెడ్డిగూడెం ఐసిడిఎస్ పిఒ పి.బ్యూలా, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, మొడియం నాగమణి, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, సిఐటియు పట్టణ అధ్యక్షులు, పి.సూర్యారావు. వంగా గోపి, ఎస్కె సుభాని, ఎ.ప్రభాకర్‌రావు, అంగన్‌వాడీ సెక్టార్ అధ్యక్షురాలు కె.విమల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'జలసిరి' బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని సిద్ధార్థ నగర్, సుంకొల్లు, యనమదల గ్రామాల్లో జలసిరి పథకంలో ప్రభుత్వం మంజూరు చేసిన జలసిరి బోర్లను ఎంఎల్‌ఎ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 28 బోర్లు రైతులకు మంజూరయ్యాయని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆరేపల్లి శిరీష, మూడు గ్రామాల సర్పంచులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే రాణించగలం

జంగారెడ్డిగూడెం:ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువు చాలా ముఖ్యమని, డిగ్రీతో పాటు విద్యార్థులందరూ ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె.ఉత్తమ్‌సాగర్ తెలిపారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన కామర్స్ డిపార్ట్‌మెంట్ వారిచే ఉన్నతవిద్యపై అవగాహన కల్పించారు. దీనిలోభాగంగా సర్ సిఆర్.రెడ్డి పీజీ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ ఎన్.సాంబశివరావు, డాక్టర్ శ్రీనివాసరావు ఉన్నతవిద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.ఉత్తమ్‌సాగర్ మాట్లాడుతూ ఉన్నతవిద్య దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. కామర్స్ విభాగంలో ఉన్న అవకాశాల గురించి ఎంబిఎ, ఎంకామ్ చదవడం వల్ల బిజినెస్ వైపు, ప్రొఫెసర్స్‌గా, మంచి అకౌంటెంట్స్‌గా బ్యాంకింగ్‌రంగంలోకి వెళ్లొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు సిహెచ్.రమాదేవి, కెవివి.శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలి

పోలవరం:గిరిజన మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో పైచేయి సాధించాలని ఒఎన్‌జిసి జనరల్ మేనేజర్ బి.కృష్ణమూర్తి అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీని కొండ్రుకోటలో ఐటిడిఎ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని జనరల్ మేనేజర్ బికృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఉంటున్న గిరిజన మహిళలు స్వశక్తితో ఎదగడానికి ఇలాంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇంటి వద్దనే ఉంటూ కష్టపడి పనిచేసి ఉపాధి పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వి.వెంకన్న, సర్పంచి పైదా నాగరాజు, ఉపసర్పంచి కొమ్ముల బద్రిరాజు, ఎం.షలీమాన్, ఈశ్వరరావు, సింహాచలం, గంగాజలం, అమ్మి రాజు, ముత్తయ్య పాల్గొన్నారు

వ్యక్తిత్వ వికాసంతోనే అభివృద్ధి

కామవరపుకోట:యువత వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డిహెచ్.మెహ్రాజ్ కోరారు. స్థానిక మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్.విజయకుమార్, ప్రిన్సిపల్ ఎం.మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లడానికి ఒక లక్ష్యంతో కృషిచేయాలన్నారు. డిగ్రీ నుండి ఆర్థిక ప్రణాళికలు అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమమంలో కెరీర్ గైడెన్స్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాస్, సెట్‌వెల్ ఎఒ కెజె.కెనడి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంలో స్పష్టత లేదు

వచ్చేనెల ఐదో తేదీ వరకూ నల్లబ్యాడ్జీలతో నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎపి జెఎసి అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా స్వచ్ఛందంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడం సంతోషాదయకమని రెవెన్యూ అసోసియేషన్ జిలా అధ్యక్షులు రమేష్ పేర్కొన్నారు. ఎపి జెఎసి అమరావతి పిలుపులో భాగంగా ఏలూరు ఆర్‌డిఒ ఆఫీస్‌తో పాటు, కుక్కునూరు సహా పలు ప్రాంతాల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏలూరులో రమేష్ మాట్లాడారు. ఈ నెల పదో తేదీన ఉద్యమ కార్యాచరణలో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మిక, రిటైర్డ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ తీర్మానం మేరకు, ఇప్పటికే నేటి నుండి ఉద్యమ కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల ఏడో తేదీన ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో జరిపిన చర్చల్లో జెఎసి అమరావతి పక్షాన కూడా రాష్ట్రకమిటీ పాల్గొని, ఉద్యోగుల అనేక ఆర్థిక, ఆర్థికేతర అంశాలు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడం, తదితర ఆర్థిక అంశాలపై, అలాగే ఆర్థికేతర అంశాలు ప్రధానంగా సిపిఎస్ రద్దు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు పెంపుదల, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపైన, గ్రామ వార్డ్ సచివాలయ ఉద్యోగుల సమస్యలు, ఆర్‌టిసి ఉద్యోగుల ఓటి ఇతర అలవెన్సులు తదితర అనేక దీర్ఘకాలిక అర్థికేతర అంశాలపై మినిట్స్‌లో స్పష్టత ఇవ్వనందున రాష్ట్ర కార్యవర్గం పూర్తిగా అసంతృప్తిని వ్యక్తం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఓటర్ల సెల్‌ఫోన్లు అనుమతించొద్దు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సమయంలో ఓటర్ల సెల్ ఫోన్లను అనుమతించవద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం ఎన్నికల జోనల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సిబ్బంది పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకోవాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలో ఎన్నికల కమిషన్ నియమనిబంధనలను ఎన్నికల సిబ్బంది ఖచ్చితంగా పాటించాలన్నారు. పోలింగ్ సిబ్బంది తమ సందేహాలను శిక్షణా సమయంలోనే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగ్ సమయంలో కొంతమంది ఓటర్లు తాము ఓటువేసిన విధానాన్ని తమ సెల్ ఫోన్‌లలో ఫొటో తీసి, సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్‌లోకి ఓటువేసేందుకు వచ్చే ఓటర్లను మాత్రమే అనుమతించాలని, వారితో పాటు సెల్ ఫోన్ బ్యాలెట్ బాక్స్ ఉన్న రూమ్‌లోకి అనుమతించొద్దన్నారు. పోలింగ్ బూత్ బయట ఉన్న పోలీస్ సిబ్బందికి సెల్ ఫోన్ అప్పగించిన తరువాతే పోలింగ్ బూత్‌లోకి ఓటరును అనుమతించాలని, అయినప్పటికీ ఓటర్లకు బ్యాలెట్ పేపర్ అందించే సిబ్బంది ఓటరు వద్ద సెల్ ఫోన్ ఉన్నదీ, లేనిదీ పరిశీలించి, సెల్ ఫోన్ ఉన్నట్లయితే, స్వాధీనం చేసుకుని, ఓటు వేసి వెళ్లే సమయంలో అప్పగించాలన్నారు. పోలింగ్ బూత్‌లోని పోలింగ్ ఏజెంట్‌లు ఓటర్ల గుర్తింపును నిర్ధారించాలని, పోలింగ్ సిబ్బంది కూడా ఓటరు గుర్తింపు కార్డు, ఓటర్ ఐడి కార్డు కూడా పరిశీలించిన అనంతరమే బ్యాలెట్ పత్రాన్ని అందించాలన్నారు. పోలింగ్ సమయంలో ఇరుపక్షాల ఓటర్లు ఎక్కువ సంఖ్యలో వచ్చినప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకోవాలని, వచ్చిన ఓటర్లు కూర్చునేందుకు అనువైన ఏర్పాట్లు చేయాలన్నారు. సిబ్బంది పోలింగ్ సామగ్రిని 12వ తేదీ సాయంత్రమే తీసుకుని, అదేరోజు రాత్రికి పోలింగ్ స్టేషన్‌కి చేరుకోవాలన్నారు. 13వ తేదీ ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియకు పోలింగ్ స్టేషన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లో ఇంటర్నెట్ కనెక్షన్, వెబ్ కాస్టింగ్‌ను ముందుగా పరిశీలించుకోవాలని, ఏదైనా సమస్యను గుర్తిస్తే వెంటనే రిటర్నింగ్ ఆఫీసర్ లేదా జోనల్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల జోనల్ అధికారులైనా ఆర్‌డిఒలు పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పోలింగ్ సమయంలో పోలింగ్ సరళిపై నిర్ణీత సమయంలో అందించే నివేదికలను ఎప్పటికప్పుడు అందించాలని, అందుకు సంబంధించిన ప్రొఫార్మాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి శుక్రవారం మరోసారి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జెసి, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డిఒలు మల్లిబాబు, డిఎస్.రాజు, ఝాన్సీరాణి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యానారాయణరెడ్డి, మైక్రో ఆబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక నిఘా : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

గంజాయి, డ్రగ్స్ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిఐలతో, ఎస్ఐలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి, సలహాలిచ్చారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ దేశానికి వెన్నెముకైన యువత డ్రగ్స్ బారిన పడొద్దన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కాలేజీ, హై స్కూల్ పరిధిలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తే కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఆర్‌టిసిలో ఆరుగురు కారుణ్య నియామకం

ప్రజాశక్తి - ఏలూరు

కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా నిలవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఆర్‌టిసిలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీలకు చెందిన ఆరుగురికి గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కారుణ్యనియామకంలో ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకాలను అర్హతను బట్టి చేస్తామన్నారు. ఖాళీల సంఖ్య, రోస్టర్ తదితరాల ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ, పట్టణ స్థాయిలో ప్రజాసేవ చేసే అవకాశం దొరికిందని, చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేయాలని అభ్యర్థులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ వేణుగోపాల్, పిఆర్‌ఒ నరసింహారావు పాల్గొన్నారు.

'5న చలో ఢిల్లీ' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కలిదిండి

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చేనెల ఐదో తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. స్థానిక సచివాలయం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడి దారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నాయన్నారు. చలో ఢిల్లీ విజయవంతం కోరుతూ ఇంటింటి ప్రచారం, జాతాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేషపు మహంకాళరావు, జక్కుల మహేష్, డి.త్రిమూర్తులు, సత్యన్నారాయణ, కె.శ్రీనివాస్, ఎన్.వెంకటశ్వరారావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

14న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
ఏడాది నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలు అందించాలి
జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్‌బిఎస్‌కె)లో ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డివార్మింగ్ డే)పై గురువారం వైద్య ఆరోగ్య, విద్య, సాంఘిక సంక్షేమం, మున్సిపల్, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల అధికారులతో జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటో తేదీ నుంచి 19 సంవత్సరాల్లోపు బాల బాలికలకు నులిపురుగుల నివారణ మందుల పంపిణీకి అవసరమైన చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతీచిన్నారికి నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మాత్రను తప్పక వేయించాలన్నారు. జిల్లాలో నాలుగు లక్షల ఆరు వేల 25 మందికి ఈ మాత్రలు సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తమకు నిర్ధేశించిన లాగిన్‌లో పొందుపర్చి పిల్లలందరికీ ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో 2,90,665 మంది విద్యార్థులకు, జూనియర్ కళాశాల, ఐటిఐ, పాలిటెక్నిక్, కళాశాలల్లోని విద్యార్థులతోపాటు ఈ విడత ప్రత్యేకంగా అన్ని డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలల్లోని మొదటి సంవత్సరం విద్యార్థులతో కలిపి మొత్తం మరో 40 వేల 224 మందికి అల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో 75,136 మంది చిన్నారులకు కూడా మాత్రలు అందిస్తారన్నారు. జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ మాత్ర వేసుకునే 10 నిమిషాల ముందు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్.మానస మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత తగ్గి, పోషకాల గ్రాహ్యతను మెరుగుపరచే ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, వైద్య విధానపరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎవిఆర్.మోహన్, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, బిసి సంక్షేమాధికారి నాగరాణి, విద్యాశాఖ ఎడి అవదాని, ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ రాజీవ్, పలువురు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సిపిఐ చేయూత

ప్రజాశక్తి - చింతలపూడి

వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 27 కుటుంబాలను ఆదుకునేందుకు సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు తెలిపారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 27 కుటుంబాలకు అండదండలుగా సిపిఐ జిల్లా సమితికి నగదు అందించినట్లు తెలిపారు. ప్రమాదంలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి నివసించేందుకు తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని డిమాండ్ చేశారు.

బుట్టాయగూడెంలో రవన్న వర్ధంతి సభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఏడో వర్ధంతి సభ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వెల్లి భారతి అధ్యక్షత స్థానిక రామసర్వయ్య భవనంలో గురువారం నిర్వహించారు. రవన్న చిత్ర పటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాఘవ పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ రవన్న ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో జన్మించారని చెప్పారు. ఆయన విద్యార్థి దశ నుంచి విప్లవం వైపు అడుగులు వేశారన్నారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా, ఆంధ్ర తెలంగాణ విడిపోయిన తరువాత తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారన్నారు. పేదల, ఆదివాసీల కోసం దళిత మైనారిటీల కోసం 1947 నుంచి ఆయన తుదిశ్వాస వరకు రహస్య జీవితం గడుపుతూ ఎన్నో ఉద్యమపోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కెచ్చెల పోతురెడ్డి, టి.బాబురావు, అలివేరు సర్పంచ్ కారం లక్ష్మి, పిడిఎస్‌యు నాయకులు బన్నే వినోద్, సరియం మల్లన్న, పాయం ముకరాజు, వేట్ల రాజిరెడ్డి, జోగారావు, కుంజారి పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ

ప్రజాశక్తి - చింతలపూడి

మానవసేవే మాధవ సేవ అని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే నిజమైన మానవత్వం అని ఎస్‌సి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, బిటెక్ నియోజకవర్గ కన్వీనర్ బోడ అవినాష్ అన్నారు. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన సత్యవతి షుగర్‌తో బాధపడుతోంది. షుగర్ కారణంగా ఇటీవల వైద్యులు ఆమె కాలును తొలగించారు. గురువారం ఆమెకు రాధమ్మ ఫౌండేషన్ ద్వారా ట్రై సైకిల్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వికలాంగులకు ట్రై సైకిల్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్, నారా లోకేష్ ఫౌండేషన్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ యర్రమల సత్యనారాయణ, టోకూరి యేసుబు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

స్వచ్ఛభారత్ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పంచాయతీ పర్యవేక్షణలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని మండలంలోని ముసునూరు మండలపరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ గత 12 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు, కార్మికులు మద్దాల నిర్మల, కొడవలి లావణ్య, వరలక్ష్మి, రాంబాబు, పేతురు, ఆనందరావు, చంటి, బతేష్, తిరుపతిరావు, ఒరుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగ రాయపాలెంలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల నాలుగో తేదీ నుంచి జరుగుతున స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపును పురష్కరించుకుని గురువారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ తనయులు దూలం శ్యామ్ ఫణికుమార్ అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు. సమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, ఆలయ ఛైర్మన్ నెలబాలుడు, వైసిపి నేత బోయిన రామరాజు పర్యవేక్షించారు

జయమంగళ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - కైకలూరు


వెంకటరమణకు బి.ఫారం అందిస్తున్న సిఎం

మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ గురువారం వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కైకలూరు టిడిపి చెందిన ఆయన ఇటీవల వైసిపిలో చేరారు. సిఎం జగన్ హామీ మేరకు ఆయన ఆటపాకలోని నివాసం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం తాడేపల్లిలోని సిఎం జగన్ క్యాంపు కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. అక్కడ బీఫారం తీసుకుని రాష్ట్ర సచివాలయంలో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఏలూరు శాసన సభ్యులు ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్, కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరావు పాల్గొన్నారు.

13 నుంచి 15 వరకూ భీమడోలు రైల్వేగేటు మూసివేత

భీమడోలు: భీమడోలు రైల్వే గేటును ట్రాక్ అత్యవసర పనుల నిమిత్తం ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రైల్వే అధికారులు మూసి వేస్తున్నారని భీమడోలు సర్పంచి పి.సునీతమాన్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఏలూరు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సమాచారం అందజేశారని సర్పంచి తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారి నుంచి భీమడోలులో ప్రవేశించే మార్గమధ్యలోని 361 నెంబరుతో భీమడోలు రైల్వే గేట్ ఉంది. దానికి సమీపంలో 507/33-34 కిలోమీటర్ల మధ్య గల డౌన్ రైల్వే ట్రాక్‌కు మరమ్మతు పనులను చేపట్టేందుకు ఈనెల 13వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ రైల్వే గేటును మూసివేస్తున్నారు. రైల్వే గేట్ మీదుగా ప్రయాణించే పాదచారులు, వాహనదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, రైల్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు - ఘోరాలు

10 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామ శివారు పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సతీష్‌కుమార్ సతీష్‌కుమార్ తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పలువురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అక్రమంగా అడవిలోకి ప్రవేశించి ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం కంపార్ట్‌మెంట్ నెంబర్ 223, 224, 225 లోకి కొత్తగూడెం గ్రామానికి చెందిన గజ్జెల ములకయ్య, కత్తి సత్తిబాబు, కాకర్ల పుల్లయ్య, నిజవరపు నాగమ్మతో పాటు కొంత మంది ఉద్దేశ పూర్వకంగా అక్రమంగా అడవిలోకి ప్రవేశించి అడవిని నరికి, నిప్పు పెట్టి కాలుస్తున్నారు. ఈ సమయంలో ఆపడానికి ప్రయత్నించిన అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఎ.జయబాబు, బేస్ కాంప్ ప్రొటక్షన్ హెల్పర్ టి.గంగరాజులను భయభ్రాంతులకు గురిచేసి వారి విధులకు ఆటంకం కలిగించినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.సురేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ద్వారకాతిరుమలలో...

ఉంగుటూరులో...

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ద్వారకా తిరుమల మండలంలోని యుటిఎఫ్ భవనంలో మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కె.అన్నమ్మను, మహిళా ఉపాధ్యాయులు పి.మేరీరాణిని, జె.ప్రభావతిని, పి.మేరిని, నాగదుర్గను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కె.అన్నమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రానున్న తరాలకు ఉన్నతమైన వ్యక్తులను అందించేది ఉపాధ్యాయులేనన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవానందరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయరాజు, బి.వి.రవీంద్ర, మహిళా సహాధ్యక్షురాలు పి.మేరీ, సహాధ్యక్షులు రాంబాబు, కోశాధికారి శ్రీనివాసరావు, కార్యదర్శి జాన్సన్, బెనర్జీ, చిన్నబాబు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని నారాయణపురంలో ఉంగుటూరు యుటిఎఫ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, స్థానిక ప్రధానోపాధ్యాయులు మీరాసాహెబ్, జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఉంగుటూరు మండలంలోని సీనియర్ మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. చేబ్రోలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడు సంయుక్తంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, ఎండి. నయనతార, వి.విజయదుర్గ, కె.వెంకటరమణ, జి.లక్ష్మీకల్యాణి, టి.అనితకుమారి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, ఎ.నాగచంద్రిక, కె.సుబ్బలక్ష్మి, పి.మల్లేశ్వరి, బి.రత్నమాల, టి.సంధ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సిహెచ్.శ్రీధర్, కె.కమల్, జిల్లా కార్యవర్గ సభ్యులు తులసీలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు ఉప్పిలి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు హరికృష్ణ, వాణి, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ డిఎన్ఆర్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్‌ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బొమ్మినంపాడులో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపికి మద్దతు తెలిపాలని ప్రజలను కోరారు. జనసేన, టిడిపి పొత్తు పెట్టుకొని పోటీ చేసినా వైసిపిని ఓడించే సత్తా ఆ పార్టీలకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారా యణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ వైస్ ఎంపిపిలు సునీత, రాధ, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం అందించాలని వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు


విఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

రుద్రంకోట గ్రామపంచాయతీలోని ప్రజలకు రేషన్‌బియ్యం తక్షణమే అందించాలని ఆ గ్రామస్తులు విఆర్‌ఒకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి తమకు రేషన్ బియ్యం అందడం లేదన్నారు. దీంతో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలలో రావాల్సిన బియ్యం కూడా నేటికీ అందలేదని, మూడు నెలలు వరుసగా రేషన్ బియ్యం తీసుకోకపోతే రేషన్ కార్డు తీసేస్తారనే భయం ప్రజల్లో ఉందని, మరి ఐదు నెలలుగా మాకు రేషన్ బియ్యం అందడం లేదని, ఈ సమస్య తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొక్కెరపాటి రవీంద్ర, కొవ్వల రమేష్, కొవ్వల నరసింహారావు, కొక్కెరపాటి శ్రీను, కొవ్వల రాజు పాల్గొన్నారు.

కంటి చూపు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

కంటిచూపు పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ సూచించారు. జల్లికొమ్మర సచివాలయం వద్ద గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 61 మంది వృద్ధులకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సంతోష్‌నాయుడు, కిరణ్మయి మాట్లాడుతూ వారానికి రెండుసార్లు ఆకుకూరలు, పండ్లు ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందన్నారు. విటమిన్ ఎ ఎక్కువగా ఉన్న ఆకుకూరలు తీసుకోవడం కంటికి మంచిదన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న 61 మందికి కళ్లజోళ్లు పడతాయని శ్రీనివాస్ చెప్పారు. వారికి ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తుందన్నారు. అనంతరం అర్ధవరం పాఠశాల విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందించినట్లు డాక్టర్ సంతోష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జె.విల్సన్‌బాబు, ఎఎన్ఎంలు కనకలక్ష్మి, ఎ.కెంపురత్నం, పి.కవిత, ఆశావర్కర్లు కుమారి, శిరీష పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోర్లగుంటలో రీ సర్వే

ప్రజాశక్తి - ముసునూరు

రీ సర్వే విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ జి.రాణి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని కోర్లగుంటలో జరుగుతున్న రీ సర్వేను ఎంపిడిఒ రాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం ఆందించే పథకాలు ప్రజలకు అందించాలని చెప్పారు.

విజయదుర్గ ఆలయానికి రూ.50 వేలు విరాళం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో నూతనంగా నిర్మించిన విజయదుర్గ ఆలయానికి దాత కొనకళ్ల పెద సోంబాబు రూ.50,116 విరాళం అందించారని ఆలయ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. స్థానిక పాత ఆంధ్రా బ్యాంక్ వీధిలో నూతనంగా నిర్మించిన విజయ దుర్గాదేవి ఆలయాన్ని దాత కొనకళ్ల పెద సోంబాబు గురువారం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.రామమోహనరావు, మారిశెట్టి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, కందుల పాటి సురేష్, గుడిమెట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరం కాలేజీ అభివృద్ధికి సహకరిస్తా

ప్రవాసాంధ్రులు విష్ణుభట్ల లక్ష్మన్న

ప్రజాశక్తి - గణపవరం


విష్ణుభట్ల లక్ష్మన్నను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గణపవరం డిగ్రీ కాలేజీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని గణపవరం మండలం సరిపల్లి నివాసి అమెరికాలో స్థిరపడిన విష్ణుభట్ల లక్ష్మన్న అన్నారు. అమెరికా నుంచి సరిపల్లి వచ్చిన సందర్భంగా ఆయన గురువారం డిగ్రీ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి ఘనంగా స్వాగత సత్కారాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ గణపవరం మండలంలో ఉన్న కాలేజీ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఆయనతో పాటు కార్నిఫోలియో నుంచి వచ్చిన అల్లూరి రామలింగరాజు, నారాయణపురం డిగ్రీ కాలేజీ విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ, సుర్పరాజు, కాలేజీ లెక్చరర్లు టి.అక్కరాజు, కె.స్వరూపరాణి, సిహెచ్.చైతన్య, అనురాధ, ఎన్‌విఎస్‌బి.శ్రీనివాస్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, డివివి చిన్నసత్యనారాయణ పాల్గొన్నారు.

ఐదు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్‌గా రాజు

ప్రజాశక్తి - చింతలపూడి

2024లో వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామని ఐదు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ రాజు అన్నారు. ఐదు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన మండలంలోని యండపల్లి గ్రామానికి చెందిన రాజుకు పట్టణంలోని ఎఎంసి మార్కెట్ యార్డు వద్ద గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజును ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్, ఎంపిపి రాంబాబు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనను ఐదు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించినందుకు రాష్ట్ర వికలాంగుల అధ్యక్షులకు, ఎంపికి, ఎంఎల్‌ఎలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల పదో తేదీ శుక్రవారం 33 కెవి శంఖుచక్రపురం ఫీడరు పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనున్నట్లు చింతలపూడి ఎఇ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల ఉంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరమతులు, పెయింటింగ్, ట్రీ కటింగ్ చేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. చింతలపూడి టౌన్‌లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

టి.నరసాపురం : 132/33 కెవి కామవరపుకోట విద్యుత్ కేంద్రంలో మరమ్మత్తుల నిమిత్తం 33 కెవి టి.నరసాపురం ఫీడర్ పరిధిలోని 33/11కెవి టి.నరసాపురం, రాజుపోతేపల్లి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొనారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వణికిస్తున్న వాతావరణం..!

ఆందోళనలో మినుము రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గత రెండు రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో మినుము రైతులు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం మండలంలో మినుము తీతలు, మినుము నూర్పిళ్లు ముమ్మురంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో వాతావరంలో వచ్చిన మార్పులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఆకాశం మేఘవృతమై ముబ్బులతో కలవరపెడుతోంది. మండలంలో సుమారు 12 వేల ఎకరాల్లో రైతులు మినుము సాగు చేశారు. 70 శాతం మినుము తీతలు తీశారు. 50 శాతం నూర్పిళ్లు పూర్తయ్యాయి. వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో వర్షం పడితే తమగతి ఏమిటో అంటూ దిగాలు చెందుతున్నారు. అసలే పైరుపై వైరస్ సోకి దిగుబడులు తగ్గిన రైతున్నలను మళ్లీ మబ్బులు బయపెడుతున్నాయి. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. అయితే దిగుబడులు గణనీయంగా తగ్గడంతో కనీసం కూలీల ఖర్చులు కూడా రాలేదంటూ రైతులు చెబుతున్నారు. ఈ తరుణంలో వాతావరణ మార్పులతో మరింత ఆందోళన చెందుతున్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త సుధాకర్ మృతి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రముఖ వ్యాపారవేత్త, విజయ పేపర్ మిల్లు అధినేత, టిడిపి నాయకులు వడ్లపట్ల సుధాకర్‌బాబు గురువారం కొవ్వలిలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. సుధాకర్ బాబు భౌతికకాయానికి మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ మాగంటి బాబు, ఉషాగ్రూప్స్ అధినేత వివి.బాలకృష్ణారావు నివాళులు అర్పించారు. ఆయన చిన్న కుమార్తె కృష్ణప్రియ అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, శృంగవృక్షం గ్రామం, డోర్ నెం. 9-40రు కాపురస్తులు **షేక్ మీరా సాహెబ్ గారి కుమారుడు షేక్ అబ్దుల్ కలం ఆజాద్,** వయస్సు 64 సం॥లు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది.

నా క్లయింటు అయిన షేక్ మీరా సాహెబ్ గారి కుమారుడు షేక్ అబ్దుల్ కలం ఆజాద్ గారికి తెలంగాణా రాష్ట్రం, కొత్తగూడెం భద్రాద్రి జిల్లా, పాల్వంచ తాలూకా ఠి.స.నెం. 414/1, 416ర్లు చ॥గ॥ 200లు స్థలం కలదు. సదరు ఆస్తికి సంబంధించిన నా క్లయింటు పేరున గల ది. 12-07-1999 సం॥ తేదీ నాటి **నెం. 1467/1999రు** గల ఒరిజినల్ విక్రయ దస్తావేజును నా క్లయింటు ఒక కవరులో పెట్టుకొని ది. 01-03-2023 సం॥ తేదీన వారి ఇంటి వద్ద నుండి శృంగవృక్షం సెంటర్‌కి జిరాక్స్ తీయించుటకు వెళ్తుండగా మార్గమధ్యములో సదరు ఒరిజినల్ విక్రయ దస్తావేజు పెట్టన కవరు జారి పడిపోయినది. నా క్లయింటు మరలా మార్గమధ్యములోనూ, పరిసర ప్రాంతాలలో వెతికినారు, అయినను దొరకలేదు. ఎవ్వరికైన దొరికిన యెడల నా క్లయింటు అయిన షేక్ అబ్దుల్ కలం ఆజాద్ గారి అడ్రెష్‌కు గాని, వారి సెల్ నెం. 9949486104 రుకు గాని తెలియపర్చగలరు.

బొక్కా చంద్రశేఖరరావు
అడ్వకేట్ & నోటరీ, తాలూకా ఆఫీసు ఎదురుగా,
భీమవరం-534201, ప॥గో॥జిల్లా
సెల్: 9491172663

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 115/2022

Between:
Valluri Venkateswara Rao and others ...*Petitioners*
AND
Sunkavalli Bhuvana Satya and others ...*Respondents*

Notice to Respondent:
R-1: Sunkavalli Bhuvana Satya, S/o. Rajini Gandhi, age 21 years, D.No. 4-16/1, Near High School, Malakapalli Village, Malakapalli Mandal, W.G.Dist., Pin: 534 340 (Driver of Hyundai Car bearing Regd. No. AP 39 DK 2001)

In the above M.V.O.P. No. 115/2022 the 1st Respondent hearing date stand posted **to 17-03-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing date: 17-03-2023

N.RAJASEKHAR, Advocate
Amalapuram, E.G.Dist.,
Cell: 9849193665
Amalapuram
Dt.27-02-2023

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం ఆచంట పంచాయతీ పరిధి కానుపోతు గుంట గ్రామానికి చెందిన బొక్క మురళి వెంకటకృష్ణ, S/o. బొక్క పేరుమల్ల మాలస్వామికి చెందిన విశాఖపట్నం వారు జారీ చేసిన పాస్‌పోర్టు నెంబర్ **S3654423** ఒరిజినల్ పాస్‌పోర్టు ఈనెల 07-03-2023వ తేదీన కానుపోతుగుంట నుంచి ఆచంట కచేరి సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళుతుండగా పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు మార్గమధ్యలో పడిపోయినది. కావునా నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

బొక్క మురళి వెంకటకృష్ణ
S/o. బొక్క పేరుమల్ల మాలస్వామి
హౌస్ నెంబర్ 30-84, కానుపోతుగుంట
ఆచంట, ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్ కోడ్ నెంబరు: 534123
సెల్: 8121971357

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 164/2022

Between:
Chavatapalli Naga Seetha Ratnam and others ...*Petitioners*
AND
Penmetsa Venkata Ramaraju and others ...*Respondents*

Notice to Respondent:
R-1: Penmetsa Venkata Ramaraju, S/o. Sattiraju, Hindu, age 58 years, Door No. 1-9-3, Adarsha Nagar, Ramalayam, Bhimavaram, W.G.Dist., Pin: 534202 (Driver cum Owner of Car bearing Regd. No. AP 31 CM 6899)

In the above M.V.O.P. No. 164/2022 the 1st Respondent hearing date stand posted **to 31-03-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing date: 31-03-2023

N.RAJASEKHAR, Advocate
Amalapuram, E.G.Dist.,
Cell: 9849193665
Amalapuram
Dt.08-03-2023

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P. No. 40/2022

పిటిషనరు: పెన్మెత్స వెంకట శివ దుర్గరాజు
రెస్పాండెంట్లు:
అనంతపల్లి వెంకట సత్య వనమరాజు, వగైరా
2వ రెస్పాండెంటు:
అనంతపల్లి లక్ష్మీ నరశింహ మధుకుమార్,
S/o. వెంకట సత్య వనమరాజు,
D.No. 3-48/1A, విస్సాకోడేరు,
పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా.

పిటిషనరు దాఖలు చేసిన పై నెంబరు I.P. నందు 2వ రెస్పాండెంటు అయిన మీకు ఆక్షేపణలు/ వాదన వున్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది. 18-4-2023 సం॥ తేదీన పగలు 10.30 ని॥లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను.లేని పక్షమున మీకు పరోక్షంగా నిర్ధారణ కాబడును.

గంధం వీరవెంకట నాగేశ్వరరావు
అడ్వకేట్, భీమవరం
సెల్: 9392235067

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారి కోర్టులో
E.P 38/2022 in O.S. 298/2015

Between:
సత్తి లక్ష్మీదేవి ...*D.H.R*
AND
ఆకుమర్తి పాప వగైరా ...*JDRs*

ప్రకటన

పై దావా గ్రంథములో JDRs అయిన (1) ఆకుమర్తి పాప, W/o. మండులు, వయస్సు 39 సం॥లు, హిందు, స్త్రీ, డో.నెం. 14-17-37/1, వార్డు నెం.24, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా. (2) ఆకుమర్తి మండులు, S/o. కొర్లపాటి, వయస్సు 44 సం॥లు, హిందు, మగ, డో.నెం. 14-17-37/1, వార్డు నెం.24, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా అను మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు Substitute Serivce ద్వారా మీకు నోటీసులు జారీ చేయవలసినదిగా ఆర్డరు యిచ్చియున్నారు. సదరు పై నెంబరు Execution Petition ది. 27-3-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు ది. 27-3-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున ఈ పిటీషను తీర్మానము చేయబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం
09-3-2023
తాడూరి లీలామాధవ్
అడ్వకేట్, తాడేపల్లిగూడెం

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.S No. 3076 OF 2021

Between:
Union Bank of India,
(Erstwhile Andhra Bank Merged in UBI)
Credit Card Division, Koti, Hyderabad, represented by the Senior Manager (Law) ...Plaintiff
AND
D1. Smt. Veeramsetti Subba Lakshmi, D/o. Sri Raja Vara Prasad, aged about 40 years, Occ: Business, R/o. D.No. 3-7-6, Vungarala Vari Street, Near Round Ramalayam, Kovur, West Godavari District, A.P. - 534350.
D2. Sri Raja Vara Prasad, father name not known to plaintiff, aged about 45 years, R/o. D. No. 3-7-6, Near Round Ramalayam, Vungarala Vari Street, Kovur, West Godavari District, Andhra Pradesh-534350. ...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,31,854-57Ps (Rupees Two lakhs thirty one thousand eight hundred and fifty four and paise fifty seven only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to **21-03-2023** for your appearance in person or through duly appointed Advocate at **10-30** A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAM ADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,West Prasanth Nagar Colony, Moosarambagh, Hyderabad-500 036